పాఠం 13

# మీరు నిజమైన మతాన్ని ఎలా కనుగొనగలరు?

మతాలన్నీ దేవునికి ప్రీతికరమైనవేనా, లేక ఒకటి మాత్రమేనా? (*1*)

క్రైస్తవులని చెప్పుకొనే వారిలో అనేక శాఖలు ఎందుకున్నాయి? (*2*)

నిజ క్రైస్తవులను మీరెలా గుర్తించవచ్చు? (*3-7*)



1. యేసు ఒకే నిజమైన క్రైస్తవమతాన్ని ప్రారంభించాడు. కాబట్టి నేడు యెహోవా దేవుని సత్యారాధికుల ఒకే సమూహము లేక గుంపు ఉండాలి. (యోహాను 4:23, 24; ఎఫెసీయులు 4:4, 5) జీవానికి నడిపే ఇరుకు మార్గంలో కేవలం కొద్దిమందే ఉన్నారని బైబిలు బోధిస్తుంది.—మత్తయి 7:13, 14.

2. అపొస్తలుల మరణం తర్వాత తప్పుడు బోధలు, క్రైస్తవేతర ఆచారాలు క్రమేణ క్రైస్తవ సంఘంలోకి ప్రవేశిస్తాయని బైబిలు ముందే తెలియజేసింది. క్రీస్తును అనుసరించే బదులు తమను అనుసరించేలా ఆ మనుష్యులు విశ్వాసులను తప్పుదోవ పట్టిస్తారు. (మత్తయి 7:15, 21-23; అపొస్తలుల కార్యములు 20:29, 30) అందుకే క్రైస్తవులమని చెప్పుకొనే అనేక విభిన్న శాఖలను మనం చూస్తాము. మనం నిజ క్రైస్తవులను ఎలా గుర్తించగలము?

3. నిజ క్రైస్తవులను గూర్చిన అత్యంత విశేషమైన గుర్తు ఏమిటంటే, నిజమైన ప్రేమ వారి మధ్య ఉండడమే. (యోహాను 13:34, 35) ఇతర జాతులు లేక ఇతర శరీర రంగుల ప్రజలకంటే తాము శ్రేష్ఠులమని తలంచేలా వారికి బోధింపబడలేదు. ఇతర దేశాలకు చెందిన ప్రజలను ద్వేషించమనీ వారికి బోధింపబడలేదు. (అపొస్తలుల కార్యములు 10:34, 35) కాబట్టి వారు యుద్ధాల్లో పాల్గొనరు. నిజ క్రైస్తవులు ఒకరినొకరు సహోదర సహోదరీల వలె చూసుకుంటారు.—1 యోహాను 4:20, 21.

4. నిజమైన మతంయొక్క మరో గుర్తు ఏమిటంటే, దాని సభ్యులకు బైబిలు ఎడల ప్రగాఢమైన గౌరవం ఉండడమే. వారు దాన్ని దేవుని వాక్యమని అంగీకరించి, అది చెప్పేదాన్ని నమ్ముతారు. (యోహాను 17:17; 2 తిమోతి 3:16, 17) వారు మానవ ఉద్దేశాలు లేక ఆచారాల కంటే దేవుని వాక్యాన్ని ఎక్కువ ప్రాముఖ్యమైనదిగా పరిగణిస్తారు.

(మత్తయి 15:1-3, 7-9) వారు అనుదినం బైబిలు అనుసారంగా జీవించడానికి ప్రయత్నిస్తారు. కాబట్టి వారు ఒకటి చెప్పి, మరొకటి చేయరు.—తీతు 1:15, 16.

5. నిజమైన మతం దేవుని నామాన్ని గౌరవించాలి కూడా. (మత్తయి 6:9) యెహోవా అనే దేవుని పేరును యేసు ఇతరులకు తెలియజేశాడు. నిజ క్రైస్తవులు అలాగే చేయాలి. (యోహాను 17:6, 26; రోమీయులు 10:13, 14) మీ ప్రాంతంలో ఉన్న ఎవరు దేవుని పేరు గురించి ఇతరులకు చెబుతున్నారు?

6. నిజ క్రైస్తవులు దేవుని రాజ్యం గురించి ప్రకటించాలి. యేసు అలాగే చేశాడు. ఆయన ఎల్లప్పుడూ ఆ రాజ్యం గురించి మాట్లాడాడు. (లూకా 8:1) ఇదే వర్తమానాన్ని భూవ్యాప్తంగా ప్రకటించమని ఆయన తన శిష్యులకు ఆజ్ఞాపించాడు. (మత్తయి 24:14; 28:19, 20) కేవలం దేవుని రాజ్యమే ఈ భూమిపైకి నిజమైన శాంతి భద్రతలను తెస్తుందని నిజ క్రైస్తవులు నమ్ముతారు.—కీర్తన 146:3-5.

7. యేసు శిష్యులు ఈ దుష్ట లోకంలో భాగమై ఉండకూడదు. (యోహాను 17:16) వారు ప్రపంచ రాజకీయ, సామాజిక వివాదాల్లో జోక్యం చేసుకోరు. ప్రపంచంలో సర్వసాధారణమైయున్న హానికరమైన ప్రవర్తనను, అలవాట్లను, దృక్పథాలను వారు విసర్జిస్తారు. (యాకోబు 1:27; 4:4) నిజ క్రైస్తవత్వపు ఈ గుర్తులున్న ఒక మత గుంపును మీరు మీ ప్రాంతంలో గుర్తించగలరా?





*నిజ క్రైస్తవులు ఒకరినొకరు ప్రేమించుకుంటారు, బైబిలును గౌరవిస్తారు, మరియు దేవుని రాజ్యం గురించి ప్రకటిస్తారు*